


### ప్రత్యేక హోదా సాధనకు జై ఆంధ్రప్రదేశ్ బహిరంగ సభ!

# గర్జించు ఆంధ్రప్రదేశ్... ప్రత్యేక హోదా కోసం గర్జించు!



**పాము తన గుడ్లను తానే తినేస్తుందట. పాముల్లాంటి వ్యక్తులు అధికారంలో ఉన్నందున తెలుగుజాతి ప్రయోజనాలు వారి స్వార్థం కోసం స్వాహా అయిపోతున్నాయి. మన రాష్ట్రాన్ని అడ్డంగా నరకటానికి పార్లమెంటే వేదిక! మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎగ్గొట్టటానికీ పార్లమెంటే వేదిక! మహానేత వైయస్సార్ మరణం నాటినుంచి కాంగ్రెస్–బీజేపీ... రెండు జాతీయ పార్టీలూ ఇక్కడి టీడీపీ అధినేత అండదండలతో ఆంధ్రప్రదేశ్‌కు చేసే అన్యాయాల వరదకు గేట్లెత్తేశాయి. దుర్మార్గంగా విభజించిన రాష్ట్రంలో యువతకు, ఇంటింటి భవితకు, ఉద్యోగ కల్పనకు అంతో ఇంతో ఉపయోగపడుతుందనుకున్న ప్రత్యేక హోదాకు... చంద్రబాబు నాయుడు లొంగుబాటుతో కేంద్ర ప్రభుత్వం పాడె కట్టేస్తోంది. నిన్నగాక మొన్నటివరకు, ప్రత్యేక హోదా కోసం పాటు పడుతున్నాం అన్నట్టుగా ఇక్కడ రాష్ట్రంలో ముఖ్యమంత్రి, అక్కడ పార్లమెంటులో తెలుగుదేశం ఎంపీలు, మంత్రులు డ్రామాలు ఆడి, పచ్చి అబద్ధాలు చెప్పారు. ఇప్పుడు, ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా నష్టంలేదన్నట్టు తెలుగునాట ఇంటింటా ఆశల దీపాలు ఆర్పే కార్యక్రమానికి మద్దతు పలుకుతున్నారు. జై తెలుగుతల్లీ, జై ఆంధ్రప్రదేశ్ అని నినదించి, మన రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడాల్సిన ఏపీ ముఖ్యమంత్రి, ప్రత్యేక హోదా ఇవ్వటం కుదరదని సంకేతాలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి దణ్ణం పెట్టి ధన్యవాదాలు చెపుతున్నారు. ప్రత్యేక హోదా అయిదేళ్ళు కాదు పదేళ్ళు కావాల్సిందే అని అడిగిన నోటితోనే గుండుసున్నా చుట్టిన వెంకయ్యానాయుడుకు దండలు వేస్తున్నారు. ప్రత్యేక హోదాకంటే మించిన ప్రయోజనాలు వస్తున్నాయని ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ సహా కేంద్ర మంత్రులు పచ్చి అబద్ధాలు చెప్పారు. ఆంధ్రపదేశ్‌కు ఇవ్వాల్సింది ఇంకా ఏమీ లేదని కడప ఎంపీ శ్రీఅవినాశ్ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2016 డిసెంబరు 14న కేంద్రప్రభుత్వం పార్లమెంటులో లిఖితపూర్వకంగా సమాధానం చెప్పింది. ప్రత్యేకహోదా ఇవ్వకపోవటం మోసం. ప్యాకేజీ ఇస్తున్నారన్నది అంతకు మించిన దగా అని నూటికి నూరుశాతం రూఢి అయిపోయింది. ఈ నిజాలను ఎప్పటికప్పుడు అందరికీ తెలియజేయటానికే వైయస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ రెండున్నరేళ్ళుగా నిరంతర పోరాటాన్ని సాగిస్తున్నారు. ఆ పోరాటం, ప్రత్యేక హోదా కోసం సాగిస్తున్న ఉద్యమం అది ఇచ్చేదాకా కొనసాగుతుంది.**

తెలుగుదేశం పార్టీ ఈ ఉద్యమాన్ని ఎలా అణగదొక్కాలా అన్న ఏకైక కార్యక్రమంతో ముందుకు వెళుతోంది. చంద్రబాబు నాయడుకు కావాల్సింది రెండే రెండు. పైన బీజేపీ... కింద డీజీపీ. తనమీద కేసులు పెట్టకుండా పైన బీజేపీ ఆశీర్వాదం కావాలి. కింద ఉన్న డీజీపీ తాను ఎవరిని వేధించమంటే వారిని వేధించాలి, ఎవరి మీద కేసులు పెట్టమంటే వారిమీద అకారణంగా, అన్యాయంగా కేసులు పెట్టాలి. ఇదీ చంద్రబాబు మార్కు పరిపాలన. ఇందులో ప్రజల జీడీపీ గురించి, నిరుద్యోగుల ఉద్యోగాల గురించి ఆలోచనే లేదు. చంద్రబాబు నాయుడుకు కావాల్సింది అయిదు కోట్ల ప్రజలకు వచ్చే ప్రత్యేక హోదా కాదు. ఇదే బాబు మార్కు పాలన!

కాబట్టే చంద్రబాబు నాయుడు తనకున్న ముఖ్యమంత్రి అనే ప్రత్యేక హోదాను... వందల అబద్ధాలు ఆడి... మోడీ, పవన్ కల్యాణ్‌ను పక్కన పెట్టుకుని తెచ్చుకున్న ముఖ్యమంత్రి అనే ప్రత్యేక హోదాను ఓటుకు కోట్లు ముట్టజెప్పిన కేసులోనో, పట్టిసీమ ముడుపుల్లోనో, రాజధాని స్విస్ చాలెంజ్‌లోనో, రాజధాని భూ కుంభకోణాల్లోనో, అవినీతి పారుదల ప్రాజెక్టుల్లోనో, గుడినీ గుడి భూముల్ని గుడుల్లో లింగాలనూ మింగిన వ్యవహారాల్లోనో, ఇతరత్రా రెండున్నరేళ్ళలో సాగించిన వందల కొద్దీ చట్ట విరుద్ధ అరాచకాలమీదో... సీబీఐ వంటి సంస్థలు ఎంక్వైరీ చేయకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ముందు సాష్టాంగం చేసి సాగిలపడుతున్నారు.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి చెపుతోంది... తెలుగుతల్లి బిడ్డలందరికీ ప్రత్యేక హోదాయే సంజీవని! ప్రత్యేక హోదాయే శ్రీరామ రక్ష! ప్రత్యేక హోదాతోనే ఉద్యోగాలు! ప్రత్యేక హోదాతోనే పరిశ్రమలు! ప్రత్యేక హోదాతోనే పన్ను రాయితీలు! ప్రత్యేక హోదాతో మనం కొనే అనేక వస్తువుల ధరలు సగానికి సగం తగ్గుతాయి! అడ్డంగా నరికిన మన రాష్ట్రానికి ప్రత్యేక హోదాయే ప్రాణ వాయువు! కాబట్టే ఆత్మాభిమానధనులైన అయిదున్నర కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలారా కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల అన్యాయాలకు వ్యతిరేకంగా జై ఆంధ్రపదేశ్ అంటూ ప్రత్యేకహోదా కోసం గర్జించండి... దిక్కులు పిక్కటిల్లేలా సింహనాదాలు చేయండి! తెలుగువాడి గర్జనను ఢిల్లీ వరకు ప్రతిధ్వనింపజేయండి! ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కు! మోసం చేస్తున్న ప్రభుత్వాలపై పోరాడి దీన్ని సాధించుకుందాం రండి!

ప్రత్యేక హోదా ఇవ్వకపోవటానికి కారణాలు ఇవి అంటూ బీజేపీ–టీడీపీ కుమ్మక్కు అయి చెపుతున్న కారణాలు అన్నీ పచ్చి అబద్ధాలు. ఈ విషయాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పదేపదే చెపుతూ వచ్చింది.

**14వ ఫైనాన్స్ కమిషన్ సిఫార్సుల వల్లే ప్రత్యేక హోదా ఇవ్వటం సాధ్యం కాదు – అని బీజేపీ చెపుతుంటే, టీడీపీ దానికి ముక్త కంఠంతో కోరస్ పాడుతోంది.**

నిజం ఏమిటంటే– 14వ ఫైనాన్స్ కమిషన్ ప్రత్యేక హోదా వద్దు అని ఎక్కడా చెప్పలేదు. ఈ విషయాన్ని ఆర్థిక సంఘానికి అధ్యక్షత వహించిన శ్రీ వై.వి.రెడ్డిగారే అక్టోబర్ 2, 2016న మంథన్ సదస్సులో స్వయానా చెప్పారు.

ప్రత్యేక హోదా మీద నిర్ణయాధికారం 14 ఫైనాన్స్ కమిషన్‌కు లేనే లేదు.

అదీగాక, 14వ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడైన అభిజిత్ సేన్‌కూడా, తాము ప్రత్యే హోదా వద్దు అని ఎటువంటి సిఫారసూ చేయలేదని వివరణ ఇచ్చారు.

14వ ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులు అమలులోకి వచ్చింది 2015 ఏప్రిల్ 1 నుంచి మాత్రమే. మోడీ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసింది 26 మే 2014న. అంటే, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత 11 నెలల పాటు 14 ఆర్థిక సంఘం అమలులోకే రాలేదు.

14వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమలులోకి వచ్చిన తరవాత కూడా 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా అలాగే కొనసాగుతోందంటే దాని అర్థం ఏమిటి? ప్రత్యేక హోదా ఇప్పటికీ కొనసాగుతోందనే కదా? ఇదే విషయాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ శ్రీ వైవీ సుబ్బారెడ్డికి ఎన్డీయే ప్రభుత్వమే లిఖితపూర్వకంగా ధ్రువీకరించింది.

http://164.100.47.192/Loksabha/Members/QResult16.aspx?qref=20918

ఆర్థిక సంఘం పని కేంద్ర ప్రభుత్వానికి జమ అయిన పన్నుల సొమ్ములో కేంద్రం– రాష్ట్రాల వాటాలను, రాష్ట్రాల మధ్య వాటాలను అయిదేళ్ళకు ఒకసారి నిర్ణయించటం. రాష్ట్రాలు తీసుకునే రుణాలు, ప్రణాళికేతర గ్రాంట్లకు సంబంధించిన సూత్రాలను కూడా ఆర్థిక సంఘం నిర్దేశిస్తుంది.


(iii) **Fourteenth Finance Commission:**

The Fourteenth Finance Commission defined the financial relationship between Centre and the States for the five year perio ending 2019-20. The Commission did not make a distinction between Special and General Category States. Its approach was t fill the resource gap of each State to the extent possible through tax devolution. Accordingly, the Commission recommended a enhanced devolution of 42% of the Central Government's tax revenues to States. If devolution alone could not cover th assessed gap, for certain States, a revenue deficit grant was provided. Andhra Pradesh was one of the States determined to be revenue deficit State, and the Commission recommended that the Centre would provide revenue deficit grant for the period ( the Fourteenth Finance Commission. The amount of deficit for each year was mentioned in the report itself and a total ( Rs.22,113 crores is to be paid to Andhra Pradesh as revenue deficit grant for the 5 year period.

*ప్రత్యేక హోదా రాష్ట్రాలకు– ప్రత్యేక హోదా లేని రాష్ట్రాలకు మధ్య రెవెన్యూ లోటును పూడ్చే విషయంలో 14వ ఆర్థిక సంఘం ఎలాంటి తేడా చూపలేదంటూ ఆర్థిక మంత్రిత్వ శాఖ సెప్టెంబర్ 8న పీఐబీ ద్వారా చేసిన రిలీజ్‌లో పేర్కొంది. ప్రత్యేక హోదాను 14వ ఆర్థిక సంఘం తీసివేసిందని చెప్పటం దిగజారుడుతనమే అని ఈ ప్రకటన కూడా స్పష్టం చేస్తోంది.*

13వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు, కేంద్ర పన్నుల రాబడిలో రాష్ట్రాలకు 32.5 శాతం వాటాను పంచితే, 2015 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చిన 14వ ఆర్థిక సంఘం ఆ వాటాను 42

శాతానికి పెంచింది. ఇలా పెంచిన తరవాత కూడా... అది ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రం అయినా, లేని రాష్ట్రం అయినా దానికి రెవెన్యూ లోటు ఉంటే, హోదా ఉండటం లేకపోవటంతో నిమిత్తం లేకుండా లోటును పూడ్చేందుకు కేంద్రం అదనపు నిధులు కేటాయించాలి అని మాత్రమే 14వ ఆర్థిక సంఘం సిఫారసు చేసింది. ఈ సిఫారసు మేరకే కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంతో పాటుగా కేరళ, పశ్చిమబెంగాల్ తదితర 11 రాష్ట్రాలకు తన పన్నుల రాబడినుంచి అదనంగా రెవెన్యూ డెఫిసిట్ గ్రాంట్ ఇస్తోంది. నిజం ఇలా ఉంటే, ప్రత్యేక హోదాను 14వ ఆర్థిక సంఘం తొలగించిందని ప్రభుత్వాల్లో ఉన్నవారు మరోలా ప్రచారం చేశారు. ఇందుకు సంబంధించి ఏపీ ప్రభుత్వం తరపున 26పేజీల అబద్ధాల పుస్తకాన్ని అచ్చువేశారు. ప్రత్యేక హోదాను తొలగించాలని


query

Abhijit Sen <abhijitsenjnu@gmail.com>
To: Jairam Ramesh <jairam54@gmail.com>

Tue, Aug 2, 2016 at 10:42 AM

The 14th FC did not recommend abolition of special category (SC) status. It merely decided to discontinue the practice of distinguishing between SC and non-SC states for computation of FC's recommendations of devolution and grants. The Centre was free to retain the distinction for plan and for non-statutory non-plan grants.

Abhijit
[Quoted text hidden]

*ప్రత్యేక హోదాను తొలగించాలి అని 14వ ఫైనాన్స్ కమిషన్ ఎలాంటి సిఫారసూ చేయలేదు అంటూ ఆర్థిక సంఘం సభ్యుడైన ప్రొఫెసర్ అభిజిత్ సేన్ రాసిన ఈ-మెయిల్.*

14వ ఆర్థిక సంఘం ఎక్కడా సిఫారసు చేయలేదు. ఇదే విషయాన్ని 14వ ఆర్థిక సంఘం సభ్యుడైన అభిజిత్ సేన్ తన లేఖ ద్వారా స్పష్టం చేశారు.

ముఖ్యమైన మరో విషయం ఏమిటంటే, ఆర్థిక సంఘం కేవలం సలహాలు ఇచ్చే సంస్థ మాత్రమే. ప్రత్యేక హోదా ఇచ్చే అధికారం జాతీయ అభివృద్ధి మండలి(ఎన్‌డీసీ)కి ఉండేది. ఎన్డీసీ అయినా, ప్రణాళికా సంఘం అయినా, ఇప్పుడు నీతీ ఆయోగ్ అయినా, కేంద్ర క్యాబినెట్ అయినా వీటన్నింటికీ ప్రధానమంత్రే నేతృత్వం వహిస్తారు. కాబట్టి, ఒక రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలా వద్దా అన్నది కేవలం క్యాబినెట్ నిర్ణయం. కాబట్టే వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలో కేవలం ఒక్క సంతకంతో ఉత్తరాఖండ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే 2014 మార్చి 2న అప్పటి కేంద్ర క్యాబినెట్ ప్రత్యేక హోదా ఏపీకి ఇవ్వండి అనే తీర్మానం చేసి వెంటనే ప్రణాళికా సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. అయినా అమలుకాని పరిస్థితి.

## ప్రణాళికా సంఘం రద్దు అయి, నీతీ ఆయోగ్ రావటం వల్ల ఇవ్వలేకపోయాం అన్నది టీడీపీ-బీజేపీల రెండో వాదన.

ప్రణాళికా సంఘానికి ప్రధాని అధిపతి. ప్రధానిగా మన్మోహన్‌సింగ్ 2014 మార్చి 2న ప్రత్యేక హోదా ఇవ్వండి అని కేంద్ర క్యాబినెట్ నిర్ణయాన్ని ప్రణాళికా సంఘానికి పంపారు. 2014 మార్చి 2నే క్యాబినెట్ నిర్ణయం జరిగిపోయినా... బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక హోదాను అమలు చేయలేదు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అడగలేదు. ప్రణాళికా సంఘం 2014 డిసెంబరు 31 వరకు జీవించే ఉంది. అంటే బీజేపీ అధికారంలోకి వచ్చిన తరవాత, 7 నెలలకు పైగా ప్రణాళికా సంఘం ఉంది. అదీగాక, బీజేపీ ప్రణాళికా సంఘాన్ని రద్దు చేయటం... లేదా దాని పేరు మార్చటం అన్నది కేవలం రాజకీయ నిర్ణయం. నిజం ఏమిటంటే మిగతా 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చినది కేవలం కేంద్ర ప్రభుత్వ నిర్ణయం, కేంద్ర క్యాబినెట్ నిర్ణయం ద్వారా మాత్రమే. అదీగాక, ఆ రాష్ట్రాలన్నింటి ప్రత్యేక హోదా యథావిధిగా కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వమే పార్లమెంటులో స్పష్టం చేస్తోంది. మరి ఏపీకి ఎందుకు ఇవ్వరు?
http://164.100.47.192/Loksabha/Members/QResult16.aspx?qref=20918

## బీజేపీ చేస్తున్న మూడో వాదన- ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తే మిగతా రాష్ట్రాలు అడుగుతాయి అని.

2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో ప్రధానిగా మన్మోహన్‌సింగ్ ప్రకటన చేసిన నాటినుంచి నేటి వరకు ఏ ఒక్క రాష్ట్రంలోనూ వారికీ ప్రత్యేక హోదా కావాలన్న ఉద్యమాలు జరగలేదే! ఏ ఒక్క రాష్ట్రం ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వవద్దు అని వాదించలేదే! అయినా అన్ని రాష్ట్రాల మద్దతూ తీసుకునే ఏపీని రాజధాని కూడా లేకుండా పార్లమెంటులో విభజించారా? ఆ రోజున జాతీయ పార్టీలూ, విభజనకు మద్దతు పలికిన తెలుగుదేశం కళ్ళు మూసుకుపోయాయా? అడ్డు తగులుతున్నాయి అని ఈ రోజు కొన్ని రాష్ట్రాల పేర్లు చెపుతున్నారు. అవి ఆ రోజు లేవా? ఆంధ్రప్రదేశ్‌కు వేరుగా, ఇదే విశాఖపట్టణంలో బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో తొలి వాగ్దానంగా 10 ఏళ్ళు ప్రత్యేక హోదా ఇస్తాం అని ఏ నోటితో చెప్పారు? 15 ఏళ్ళు కావాలని చంద్రబాబు నాయుడు ఏ నోటితో అడిగారు? ఎన్నికలముందు సభల్లో చంద్రబాబు నాయుడు కూడా ప్రత్యేక హోదాను ఎందుకు ఊదరగొట్టారు?

## తెలుగుదేశం, బీజేపీ చేస్తున్న నాలుగో వాదన- ప్రత్యేక హోదా రాష్ట్రాలకు ఉద్యోగాలు, పెట్టుబడులు ఏం వచ్చాయన్నది.

కొండలు, అడవులు, విదేశాలతో సరిహద్దు రాష్ట్రాలకు మాత్రమే ఇంతకు ముందు ప్రత్యేక హోదా ఇచ్చాం అంటున్నారు. ఆ రాష్ట్రాలకు ఏం నిధులు వచ్చాయి... ఏం పరిశ్రమలు వచ్చాయి అని చంద్రబాబు నాయుడు, వెంకయ్య నాయుడు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏం మాట్లాడారో ఈ నాయకులు గుర్తుకు తెచ్చుకుంటే మంచిది. అయిదేళ్ళు కాదు పదేళ్ళు కావాలని వెంకయ్య నాయుడు అంటే... పదేళ్ళు కాదు పదిహేనేళ్ళు కావాలి అని చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు.

## ప్రత్యేకహోదాతో ప్రయోజనం పొందిన రాష్ట్రాలు..

ఉదాహరణకు ఉత్తరాఖండ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వడం వల్ల ఆ రాష్ట్రంలో 30,244 పరిశ్రమలు వచ్చాయి. రూ.35 వేల కోట్ల పెట్టుబడులతో ఒకేసారి 130 శాతం అధికంగా పరిశ్రమలు ఏర్పాటు కావడం వల్ల ఉపాధి అవకాశాలు 490 శాతం పెరిగి, 2,45,500 ఉద్యోగాలు వచ్చాయి.

మన రాష్ట్రం కంటే బాగా వెనకబడిన హిమాచల్ ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వల్ల ఏకంగా 10,864 పరిశ్రమలు వచ్చాయి. 1,29,443 ఉద్యోగాలు వచ్చాయి. ఈ విషయాలన్నీ పార్లమెంటులో శ్రీ కేసీ త్యాగి అడిగిన ప్రశ్నకు 2016 మార్చి 2న లిఖితపూర్వకంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో ఉన్నాయి. ఈ వాస్తవాలన్నీ మన ముఖ్యమంత్రికి కనిపించటం లేదా? అబద్ధాలు చెప్పటానికి అయినా హద్దులు ఉండాలి.
http://dipp.nic.in/English/questions/02032016/ru665.pdf

- ప్రత్యేక హోదా కలిగిన ఈశాన్య రాష్ట్రాలకు 2017 వరకు పారిశ్రామిక రాయితీలను పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం(డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్) ఏప్రిల్ 1, 2007న చేసిన ప్రకటనను ఈ కింది లింక్ ద్వారా ఎవరైనా చూడవచ్చు.
http://dipp.nic.in/English/Schemes/NER/neiipp_2007.pdf
- ప్రత్యేక హోదా కలిగిన ఈశాన్య రాష్ట్రాల్లో పారిశ్రామిక రాయితీలు కొనసాగిస్తున్నారా? వాటి వల్ల పెట్టుబడులు ఏమైనా వచ్చాయా? పరిశ్రమలు, ఉద్యోగాలు ఏమైనా వచ్చాయా? అంటూ లోక్‌సభలో సభ్యులు 2015 మే 8న అడిగిన ప్రశ్నకు కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాధానాన్ని నేరుగా కేంద్ర వెబ్‌సైట్ లింకు ద్వారా మీరే చూడండి...
http://dipp.nic.in/English/questions/08052015/lu7075.pdf
- దేశంలో వెనుకబడిన జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి? ఇస్తున్న రాయితీలు ఏమిటి? కొత్తగా పారిశ్రామిక సంస్థలు ఎక్కడ నెలకొల్పుతున్నారు- అని రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం తరపున వచ్చిన సమాధానం... ఈ లింక్ ద్వారా చూడండి.
http://dipp.nic.in/English/questions/02032016/ru665.pdf

## తెలుగుదేశం, బీజేపీ చేస్తున్న అయిదో వాదన- ప్రత్యేక హోదా రాష్ట్రాలకు నిధులు తక్కువగా వచ్చాయి అన్నది.

ప్రత్యేక హోదా కలిగిన జమ్మూ కాశ్మీర్‌కు ప్రధాని నరేంద్రమోడీ ఎన్నికల సమయంలో వెళ్ళినప్పుడు, రూ.70 వేల కోట్లు గ్రాంట్‌గా కూడా ఇచ్చారు. ఆ రాష్ట్ర జనాభా 1.25 కోట్లు మాత్రమే. ఇవన్నీ వారికి కనిపించటం లేదా? ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఎంత ఇవ్వాలి అన్న దానికి నిర్దిష్టమైన ఫార్ములా ఏదీ లేదు. ఆ రాష్ట్రాల వ్యయ ప్రణాళిక పరిమాణాన్ని, అంతకు ముందు ఆ రాష్ట్రాలు చేసిన ప్రణాళికా వ్యయాన్ని ప్రాతిపదికగా తీసుకుని ఏ మేరకు నిధులు ఇవ్వాలి అన్నది కేంద్ర ప్రభుత్వం ఇష్టం.

## తెలుగుదేశం- బీజేపీలు చేస్తున్న ఆరో వాదన- ఏ రాష్ట్రానికీ ఇంతవరకు చరిత్రలో ఎప్పుడూ ఇవ్వని పారిశ్రామిక రాయితీలు మనకే ఇచ్చారని.

- కేవలం ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు ఇచ్చే ఇటువంటి రాయితీల కోసం పరిశ్రమలు ఎగబడి వస్తాయి తప్ప, చిన్నా చితకా రాయితీల కోసం కాదు. ప్రత్యేక హోదా ఉంటేనే పారిశ్రామిక యూనిట్లకు 100 శాతం ఎక్సైజ్ డ్యూటీ మినహాయింపు లభిస్తుంది. ఆదాయం మీద పన్ను(ఇన్‌కమ్ ట్యాక్స్)లో కూడా 100 శాతం రాయితీ లభిస్తుంది. పన్ను మినహాయింపులు, ఫ్రైట్ రీయింబర్స్‌మెంట్‌లు దక్కుతాయి. ప్రత్యేక హోదాతో దక్కే ఇలాంటి రాయితీలు ఉంటేనే మిగతా రాష్ట్రాల నుంచి కూడా ఆంధ్రప్రదేశ్‌కు పెద్దపెద్ద కంపెనీల పారిశ్రామిక వేత్తలు రెక్కలు కట్టుకు వస్తారు. లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయి. లక్షల సంఖ్యలో ఉద్యోగాలు సమకూరతాయి.
- మన రాష్ట్రంలో ఉన్న ఔత్సాహికులు సొంతంగా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఈ నిర్ణయాలు దోహదం చేస్తాయి. మధ్య, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఇలాంటి రాయితీలు పనికి వస్తాయి.
- పరిశ్రమల ఏర్పాటుకు తీసుకునే వర్కింగ్ క్యాపిటల్‌పై 3 శాతం వడ్డీ రాయితీ లభిస్తుంది.
- ఇవే కాకుండా ఇన్సూరెన్స్, రవాణా వ్యయంపైనా రాయితీలు ఉంటాయి.
- కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమల శాఖ ఏర్పాటు సమీకృత మౌలిక సదుపాయాల కల్పన కేంద్రాల ఏర్పాటులో పెట్టుబడుల తీరును ప్రత్యేక హోదా మారుస్తుంది. ప్రభుత్వ రంగంలోని ఓఎన్జీసీ, హెచ్‌పీసీఎల్ వంటివి కూడా భారీ పెట్టుబడులతో ముందుకు వచ్చే అవకాశం ఉంది.

ఫలితంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వ తక్కువ పెట్టుబడితో కేంద్రాల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ పెద్దసంఖ్యలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు వస్తాయి. తక్కువ నైపుణ్యం ఉన్నవారికీ ఉద్యోగాలు, ఉపాధి కల్పించడంలో ఈ పరిశ్రమలు దోహదం చేస్తాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే ప్రత్యేక హోదాతో ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలూ ఒక్కో హైదరాబాద్‌గా రూపొందుతాయి. కంపెనీలే నిరుద్యోగుల వెంట పడే పరిస్థితి వస్తుంది. నో వేకెన్సీ బోర్డులు పోయి వాంటెడ్ అంటూ ప్రతి కంపెనీ ఎదుటా బోర్డులు పెట్టే పరిస్థితి వస్తుంది.

- పన్ను రాయితీలు, ప్రోత్సాహకాల వల్ల మనం కొనుగోలు చేస్తున్న అనేక వస్తువుల ధరలు సగానికి సగం తగ్గే అవకాశం ఉంది. ఉత్పత్తి చేసే వస్తువులమీద 100 శాతం పన్ను రాయితీలు లభిస్తే ఏ రాష్ట్రంలోనూ లభించనంత చౌకగా మన రాష్ట్ర ప్రజలకు వస్తువులు అందుతాయి.
- ఇలాంటి రాయితీలు ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలకు మాత్రమే ఇచ్చారని తెలిసి కూడా... తెలంగాణతో పాటు ఏపీని కలిపి ఇద్దరికీ పప్పుబెల్లాలు పంచినట్టు పెట్టుబడులకు సంబంధించి ఎన్‌హాన్స్‌డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఎలవెన్స్, యాక్సిలరేటెడ్ డిప్రీసియేషన్‌కు అవకాశం వంటి పనికిమాలిన చిన్నా చితకా రాయితీలు ఇచ్చారని తెలిసి కూడా.... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు గట్టిగా నిలదీయకుండా ఇవే గొప్ప రాయితీలు, మనకు మాత్రమే ఇచ్చారు అని అబద్ధాలు చెపుతున్నారంటే ఈయన్ను చీఫ్ మినిస్టర్ అనాలా? లేక చీట్ మినిస్టర్ అనాలా?

ఇన్ని నిజాలు కళ్ళముందు ఉన్నా ఇవన్నీ చంద్రబాబు నాయుడుకు కనిపించటం లేదా? ప్రత్యేక హోదా రాష్ట్రాలకు ఇచ్చే రాయితీలు 1997 నుంచి 2007 వరకు కొనసాగాయి. 2007 నుంచి 2017 వరకు మరోసారి వాటిని పొడిగించారు కూడా. ఇప్పటికీ ఈ రాయితీలు, ప్రయోజనాలన్నీ ఈశాన్య రాష్ట్రాలకు నిరాఘాటంగా కొనసాగుతున్నాయి.

http://dipp.nic.in/English/Schemes/NER/neiipp_2007.pdf

## లంచాల కేసునుంచి బయటపడటం సంజీవని అవుతుందా?

ఆంధ్రప్రదేశ్‌లో లంచాలు తీసుకుని పట్టిసీమ నుంచి పోలవరం దాకా, ఇసుక నుంచి బొగ్గు దాకా, ఎంపిక చేసిన వారికి పారిశ్రామిక రాయితీలు మొదలు మద్యం ఉత్పత్తి పెంపు లైసెన్సుల వరకు, జెన్‌కోలో కుంభకోణాల నుంచి గుడి భూముల కైంకర్యాల వరకు... ప్రతి ఒక్క అంశంలోనూ విచ్చలవిడిగా పుచ్చుకున్న ముడుపులతో వందల కోట్లు కుమ్మరించి తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ఆడియో వీడియో సాక్ష్యాలతో సహా అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు నాయుడు గారికి ఇప్పుడు ఏపీకి ప్రత్యేక హోదా కంటే తన ముఖ్యమంత్రి హోదా ఊడకుండా చూసుకోవటం ముఖ్యమయింది. అందుకే ఆ కేసునుంచి బయట పడేందుకు అయిదు కోట్ల ప్రజలు, వారి పిల్లలు, భవిష్యత్తు తరాల ప్రయోజనాలన్నింటినీ తాకట్టుపెట్టిన విధంగా ఢిల్లీ వెళ్ళి మరీ... ప్రత్యేక హోదా సంజీవని కాదు అంటూ దుర్మార్గమైన ప్రకటన చేశారు. కాబట్టే సెప్టెంబరు 7 అర్ధరాత్రి, కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ కూడా హోదా లేదని తేల్చేశారు. ఆ తరవాత టీడీపీ-బీజేపీ నాయకులు మాత్రం, జైట్లీ చెప్పకపోయినా... రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలనే చూపి, కొత్తగా ప్రత్యేక ప్యాకేజి వచ్చిందంటూ సంబరాల డ్రామా ప్రారంభించారు. ప్యాకేజీకి అర్థం- అవి రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం చట్టప్రకారం మన రాష్ట్రానికి ఇస్తానన్న నిధులు అనే కదా? ఆ నిధులు మనకు రావటం మన హక్కు కదా? అవే నిధులకు ప్యాకేజీ అని పేరు పెట్టి, అదేదో కొత్తగా తానేదో తీసుకువస్తున్నాని మభ్యపెట్టే ప్రయత్నం దారుణం కాదా? ఏకంగా ప్రత్యేక హోదానే పణంగా పెట్టటం క్షమార్హం కాని నేరం కాదా?

## ప్రత్యేక హోదాతో మాత్రమే ఇవన్నీ సాధ్యం!

**కేంద్ర గ్రాంట్లు 90 శాతం వస్తాయి**

- ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు పన్నుల్లో వాటాతో పాటు గ్రాంట్లు, లోన్ ద్వారా రాష్ట్రాలకు సొమ్ము అందుతుంది. గ్రాంట్ అంటే తిరిగి చెల్లించనక్కరలేని సొమ్ము. అదే లోన్ అయితే తిరిగి చెల్లించాలి.
- స్పెషల్ కేటగిరీ లేని రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చే గ్రాంట్లు 30 శాతానికి మించి ఉండవు. అంటే ఏ పథకం, ఏ కార్యక్రమం చేపట్టినా.. కేంద్రం గ్రాంట్ పోనూ మిగతా 70 శాతం లోనుగానే వస్తుంది.
- అదే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే కేంద్ర గ్రాంట్ 90 శాతం అందుతుంది. లోన్ కేవలం 10 శాతం ఉంటుంది. ప్రత్యేక హోదా రాష్ట్రాలకు గతంలో, ప్రస్తుతం వాటి ప్రణాళికా వ్యయం పరిమాణాన్ని బట్టి నిధులు కేటాయిస్తారు.
- ప్రత్యేక హోదా లేని రాష్ట్రాలకు గాడ్గిల్ ముఖర్జీ ఫార్ములా ప్రకారం 30 శాతం గ్రాంట్, 70 శాతం లోన్‌గా వస్తాయి. విడిపోయిన, రాజధానిని కోల్పోయిన రాష్ట్రానికి 90 శాతం గ్రాంట్లతో ప్రత్యేక హోదా కావాలా? లేక గాడ్గిల్ ముఖర్జీ ఫార్ములా ప్రకారం అరకొర నిధులు రావాలా?

## హోదా ఉంటే మన నీటి ప్రాజెక్టుల్ని కేంద్రమే కడుతుంది

- యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రామ్(ఏఐబీపీ) అనేది కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల్లో నీటి ప్రాజెక్టులకు నిధులు ఇచ్చే కార్యక్రమం. ప్రత్యేక హోదా లేని రాష్ట్రాలకు ఈ పథకం కింద మహా అయితే 25 నుంచి 50 శాతం నిధులు గ్రాంట్‌గా ఇస్తారు. అదే ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి 90 శాతం నిధులను కేంద్రమే గ్రాంట్‌గా ఇస్తుంది.

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం పేరా నంబర్ 10లో హంద్రీ-నీవా, గాలేరు-నగరి, వంటి నీటి పథకాలు ఉన్నాయి. ఇవి పూర్తి కావాలంటే కనీసం రూ.8 వేల కోట్లు కావాలి. ప్రత్యేక హోదా ఉంటేనే ఈ ప్రాజెక్టులకు 90 శాతం గ్రాంట్ వస్తుంది.

## హోదా ఉంటే మన రుణాన్ని కేంద్రమే చెల్లిస్తుంది

- విదేశీ రుణ భారాన్ని కేంద్రమే భరిస్తుంది. రుణంలో 90 శాతం మొత్తాన్ని కేంద్రమే తిరిగి చెల్లిస్తుంది. ఆ రుణంపై వడ్డీ కూడా కేంద్రమే కడుతుంది.
- ఉదాహరణకు విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు రూ.5000 కోట్ల రుణాన్ని ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి తీసుకోవాలనే ప్రతిపాదన ఉంది. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైళ్ళ ఏర్పాటుకు దాదాపు రు.8 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా. ఈ రెండు ప్రాజెక్టులకు కూడా విదేశీ ఏజెన్సీల నుంచి రుణం పొందనున్నారు.

## కారిడార్, మెట్రో రైలు ఖర్చూ కేంద్రానిదే...

విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, విశాఖ, విజయవాడ(వీజీటీఎం) మెట్రో రైళ్ళు..విభజన చట్టంలో హామీలే. 90 శాతం రుణం కేంద్రం భరిస్తే.. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్- అన్నీ వస్తాయి. ఎంతో మంది పారిశ్రామికవేత్తలు కారిడార్ పొడవునా పరిశ్రమలు పెడతారు. భారీగా ఉద్యోగాలూ వస్తాయి. కారిడార్ వెంబడి అనుబంధ పరిశ్రమలు వస్తాయి. ఉపాధి, యువత ముందుకు వస్తుంది. అదే ప్రత్యేక హోదా లేకపోతే, ఈ ప్రాజెక్టులన్నింటికీ కేంద్రం నిధుల్ని గ్రాంట్‌గా ఇచ్చే విషయం దేవుడెరుగు... వడ్డీతో సహా మొత్తం మన రాష్ట్రమే కట్టాల్సి వస్తుంది. అటువంటి పరిస్థితుల్లో గ్రాంట్లు ఇస్తే గిస్తే... వారి దయ- మన ప్రాప్తం!

**మనకు ఇది కావాలి... మనకు ఇది రావాలి... మనం పోరాడి అయినా ఇది సాధించుకోవాలి... మన భవిష్యత్తు తరాలకు అన్యాయం జరగకుండా చూడాలి అని రాష్ట్ర ప్రజల తరఫున పోరాడే తత్వమే లేకుండా... సీఎం అమ్ముడు పోయారు. చంద్రబాబు సాగిలపడ్డారు. అయిదున్నర కోట్ల ప్రజలకు వెన్నుపోటు పొడిచారు. కాబట్టే మన హక్కులు మనం కాపాడుకునేందుకు, మన రాష్ట్రాన్ని మనమే నిలబెట్టుకునేందుకు ప్రత్యేక హోదా ఉద్యమాన్ని ఉవ్వెత్తుకు చేర్చాల్సిన సమయం ఆసన్నం అయింది. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కు కోసం చేస్తున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపునిస్తోంది.**




ప్రత్యేక హోదా కోసం 2015 ఆగస్టు 10న ఎంపీలు, ఎమ్మెల్యేల సహా ఢిల్లీలో ధర్నా. శ్రీ జగన్‌ను అరెస్టు చేస్తున్న ఢిల్లీ పోలీసులు



# వైయస్సార్ కాంగ్రెస్ భుజస్కంధాలమీదే రెండున్నరేళ్ళుగా ప్రత్యేక హోదా కోసం పోరాటం

దగాపడ్డ రాష్ట్రాన్ని నిలబెట్టుకునే బాధ్యత మనందరిమీదా ఉంది కాబట్టే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదా ఏపీ హక్కు అంటూ దిక్కులు పిక్కటిల్లేలా ఢిల్లీలో ధర్నా చేసింది. పార్లమెంటులో నినదించింది. ఆంధ్రప్రదేశ్ నలు దిశలా శ్రీ జగన్ ఆధ్వర్యంలో దీన్ని రెండున్నరేళ్ళుగా ఇంటింటా ప్రతి ఒక్కరికీ అర్థం అయ్యేలా అటు శాసన సభలో, ఢిల్లీ పర్యటనల్లో, జిల్లాల్లో... ప్రతి ఒక్కరికీ అర్థం అయ్యేలా, సామాన్యులు సహా ప్రతి ఒక్కరూ మాట్లాడగలిగేలా ప్రజలందరికీ విన్నపాలు చేసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఎన్నికలు ముగిసిన నాటినుంచి ఈ రోజు వరకు ప్రత్యేక హోదా ఉద్యమాన్ని తన బాధ్యతగా భుజాన వేసుకుని ముందుకు వెళుతోంది.

**19-05-14** ఢిల్లీ లోని గుజరాత్ భవన్‌లో కాబోయే ప్రధాని నరేంద్ర మోడీని కలిసి నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురోభివృద్ధికి సహకారం అందించాలని, ప్రత్యేక హోదా సహా విభజన బిల్లులోని హామీలన్నీ నెరవేర్చాలని కోరిన శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైయస్సార్‌సీపీ బృందం.

**12-06-14** ఆంధ్రప్రదేశ్‌కు 20 ఏళ్లకు ప్రత్యేక హోదా కల్పించాలని లోక్‌సభలో ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో కోరిన వైయస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు శ్రీమేకపాటి రాజమోహన్ రెడ్డి డిమాండ్.

**05-12-14** ఎన్నికల హామీలు నెరవేర్చని చంద్రబాబు ప్రభుత్వంపై నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా కార్యక్రమాలు, విశాఖ కలెక్టరేట్‌వద్ద ధర్నాలో పాల్గొన్న శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి.

**15-02-15** ఢిల్లీ పర్యటనలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను, ఆర్థిక మంతి అరుణ్ జైట్లిని కలిసిన ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని కోరిన శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి.

**16-03-15** లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చలో ఏపీకి తక్షణం ప్రత్యేక హోదా ఇవ్వాలని వైయస్సార్ కాంగ్రెస్ ఎంపీల డిమాండ్.

**30-03-15** స్పెషల్ స్టేటస్, విభజన చట్టంలోని అంశాల అమలును కోరుతూ ఢిల్లీలో ప్రధాని మోడీని కలిసిన శ్రీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైయస్సార్‌సీపీ బృందం.

**03-06-15** ఏడాది పాలనలో చంద్రబాబునాయుడు ప్రజలకు చేసిన మోసాలను, ప్రత్యేకహోదా సాధించలేకపోవడాన్ని ఎండగడుతూ మంగళగిరి వద్ద శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల సమర దీక్ష. ప్రజా బ్యాలెట్ నిర్వహణ. (03-06-15 మరియు 04-06-15 రెండు రోజులు)

**09-06-15** ఏపీకి ప్రత్యేక హోదా కల్పించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చూడాలని భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని కలిసి వినతి పత్రం సమర్పించిన శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిగారి నేతృత్వంలోని వైఎస్సార్సీపీ బృందం.

**11-06-15** ఓటుకు నోటు వ్యవహారంలో చంద్రబాబు అవినీతి, ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని ఇతర హామీల అమలు కోరుతూ ఢిలీలో కేంద్ర మంత్రులు, రాజ్‌నాథ్ సింగ్, అరుణ్ జైట్లీలను కలిసిన శ్రీజగన్

**10-08-15** ఏపీకి ప్రత్యేక హోదా కోరుతూ ఢిల్లీలో ఒకరోజు ధర్నా నిర్వహించిన శ్రీ వైయస్ జగన్‌మోహన్ రెడ్డి.

**29-08-15** ప్రత్యేక హోదా సాధన కోసం రాష్ట్ర బంద్ నిర్వహించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.

**15-09-15** తిరుపతిలో ప్రత్యేకహోదా కోసం నిర్వహించిన విద్యార్థుల యువభేరి సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించిన శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి.

**22-09-15** విశాఖపట్నంలో ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులు ప్రత్యేకహోదా కోసంనిర్వహించిన యువభేరి సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి.

**07-10-15** ప్రత్యేక హోదా కోరుతూ గుంటూరులో నిరవధిక నిరాహార దీక్షను చేపట్టిన శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి. (07-10-15 నుంచి 13-10-15 తెల్లవారుజాము వరకు 7 రోజులు)

**17-10-15** ప్రత్యేక హోదా సాధనలో భాగంగా ఈనెల 17-10-15 నుంచి 21-10-15 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రిలే దీక్షలకు పిలుపునిచ్చిన వైయస్సార్‌సీపీ.

**27-01-16** ప్రత్యేక హోదా కోరుతూ కాకినాడలో యువభేరి సదస్సులోనూ, తర్వాత బహిరంగ సమావేశంలోనూ పాల్గొన్న శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి.

**02-02-16** ప్రత్యేక హోదా కోరుతూ శ్రీకాకుళంలో యువభేరి సదస్సులో పాల్గొన్న శ్రీవైయస్ జగన్‌మోహన్‌రెడ్డి.

**23-02-16** శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన - రాష్ట్రపతిని కలిసి ప్రత్యేక హోదాతో సహా ఏపీకి విభజన సమయంలో ఇచ్చిన హామీలన్నిటినీ అమలయ్యేలా చూడాలని కోరిన జగన్. కాపు ఉద్యమం, గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయకపోవడం, చంద్రబాబు ప్రభుత్వ అవినీతి వ్యవహారాలను రాష్ట్రపతి దృష్టికి తీసుకు వెళ్లిన శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి.

**27-04-16** సేవ్ డెమొక్రసీ పోరులో భాగంగా ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిసిన శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి. చంద్రబాబు అవినీతి, ఫిరాయింపులపై విచారణ చేయించాలని కోరడంతో పాటు, ఏపీకి ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై మరో వినతి పత్రాని కేంద్ర మంత్రికి అందించారు.

**10-05-16** రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద వైయస్సార్‌సీపీ ధర్నాలు. కాకినాడ కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి.

**21-07-16** రాజ్యసభలో ప్రత్యేకహోదాపై ప్రైవేటు బిల్లుకు మద్దతు ప్రకటించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.

**23-07-16** 15 ఏళ్ల ప్రత్యేక హోదా కోరుతూ లోక్‌సభలో ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టిన వైయస్సార్‌సీపీ ఎంపీ శ్రీ వైవీ సుబ్బారెడ్డి.

**29-07-16** రాజ్యసభలో అరుణ్ జైట్లీ సమాధానం, టీడీపీ, బీజేపీ వైఖరులకు నిరసనగా అగస్ట్ 2న రాష్ట్ర బంద్‌కు పిలుపు ఇచ్చిన శ్రీ వైయస్ జగన్?

**04-08-16** ప్రత్యేక హోదా కోరుతూ నెల్లూరులో జరిగిన యువభేరి సదస్సులో పాల్గొన్న శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి.

**08-08-16** ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని కలిసి వినతిపత్రం సమర్పించిన శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు.

**08-09-16** ప్రత్యేక హోదా ఇవ్వబోమని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టంగా తేల్చి చెప్పటమేగాక, ఆయన ప్రకటనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆహ్వానించినందుకు నిరసనగా సెప్టెంబరు 10న రాష్ట్ర బంద్ పాటించాలని పిలుపునిచ్చిన శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి.

**10-09-16** మూడు రోజులపాటు జరిగిన (8,9,10) ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు. ప్రత్యేకహోదా కోసం ఆందోళనలతో శాసనసభను స్తంభింపచేసిన వైయస్సార్‌సీపీ.

**22-09-16** ప్రత్యేక హోదా కోరుతూ ఏలూరులో జరిగిన యువభేరి సదస్సులో పాల్గొన్న శ్రీవైయస్ జగన్‌మోహన్ రెడ్డి.

**25-09-16** ప్రత్యేకహోదా విషయమై ప్రవాసాంధ్రులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రవాసాంధ్రులతో ముఖాముఖిలో పాల్గొన్న శ్రీవైయస్ జగన్.

**24-10-16** ప్రత్యేక హోదా కోరుతూ కర్నూలులో జరిగిన యువభేరి సదస్సులో పాల్గొన్న శ్రీవైయస్ జగన్. అవసరమైతే ఎంపీల చేత రాజీనామా చేయించి కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామని ప్రకటించిన శ్రీ వైయస్ జగన్.

**06-11-16** ప్రత్యేకహోదా పోరాటాన్ని తీవ్రతరం చేస్తూ విశాఖపట్టణంలో ''జై ఆధ్రప్రదేశ్'' బహిరంగసభ.

/ysrcpofficial @YSRCParty www.ysrcptv.com /ysrcpofficial 9010 295 617
/ysjagan @ysjagan www.ysrcongress.com http://epaper.ysrcongress.com

Printed and Published by V. Vijaya Sai Reddy, General Secretary, YSR Congress Party Office, Road No.12, Banjara Hills, Hyderabad-500034.